

మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మాట్లాడుతున్న మహారాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం

# ప్రభుత్వ శాఖల పని తీరు భేష్

**కితాబిచ్చిన మహారాష్ట్ర ప్రజాప్రతినిధులు,అధికారుల బృందం.. టీఎస్ఐఆర్డీలో శిక్షణ పొందుతున్న జిల్లా పరిషత్ చైర్మన్లు, జిల్లా స్థాయి అధికారులు.. చిలుకూరు గ్రామపంచాయతీని సందర్శించి వివరాల సేకరణ**

మొయినాబాద్, ఫిబ్రవరి 3 : తెలంగాణ ప్రభుత్వ శాఖల పనితీరు బాగున్నదని మహారాష్ట్ర జిల్లాస్థాయి అధికారులు, జిల్లా పరిషత్ చైర్మన్ల బృందం కితాబునిచ్చింది. రాజేంద్రనగర్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థలో ఏయే శాఖలు ఉన్నాయి, పని తీరు ఎలా ఉన్నది..ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారన్న పలు అంశాలపై శిక్షణ పొందుతున్నారు. వారి శిక్షణలో భాగంగా శనివారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామ పంచాయతీని సందర్శించి వివరాలను సేకరించారు. గ్రామ పంచాయతీ ద్వారా ఎలాంటి సేవలు ప్రజలకు అందిస్తున్నారనే అంశాలను గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సంధ్య, గ్రామ కార్యదర్శి వెంకటేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు, ప్రభుత్వ నిధులపై ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల వారీగా ఆ శాఖలు ఎలాంటి నిధులు ఖర్చు చేస్తున్నారు, ఆ శాఖ మండల స్థాయి అధికారులు ఎలాంటి సేవలు చేస్తారనే పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మండల స్థాయిలో ఎలాంటి పనులు చేస్తుంది, అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య ఎలాంటి విధులు నిర్వహిస్తారనే అంశాలను ఎంపీడీవో సంధ్య తెలిపారు. మండల పరిషత్‌కు అధ్యక్షురాలు ఉంటారని, వారు ఆధ్యక్షతన ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయడంతో పాటు అన్ని శాఖల అధికారులను భాగస్వాములను చేయడం జరుగుతున్నదని ఎంపీడీవో తెలిపారు. మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి, విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు అందుతున్నాయో మండల విద్యాధికారి వెంకటయ్య చెప్పారు. గ్రామ పంచాయతీలు ఎలాంటి పనులు చేస్తున్నది, నిధులు ఎలా ఖర్చు పెడుతారు.. తదితర విషయాలను ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి వివరించారు.

రెవెన్యూ శాఖ ద్వారా భూముల క్రయ విక్రయాలు, వాటి అమలు తీరును డీటీ వినోద్ తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామంలో అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులు చేయిస్తామని పీఆర్ ఏఈ రమ్య పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు తమ తమ శాఖల విధివిధానాలు, ఆయా శాఖల అధికారులు చేస్తున్న పనులను వివరించడంతో మహారాష్ట్ర అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వారితో పాటు సీఈవో ఉమారాణి, మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

# నయా ట్రెండ్

**పల్లెల్లోనూ కొత్తకొత్త డిజైన్లతో ఇండ్ల నిర్మాణాలు**

**గృహమే కదా స్వర్గసీమ అన్నాడో సినీ కవి.. అందమైన ఇల్లు కట్టుకోవాలన్నదే కోరిక. ఒక్కొక్కరికి ఒక్కో అభిరుచి ఉంటుంది. అందమైన పొదరిల్లు నిర్మాణానికి అయ్యే ఖర్చు కంటే డిజైన్‌కే ఎక్కువవుతున్నది. కొత్త కొత్త డిజైన్లతో ఇంటీరియల్ డెకరేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. బయటి ఎలివేషన్ మొదలు.. ఇంటీరియల్ ఎంపికలోనూ కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. పాల్ సీలింగ్, కప్ బోర్డులు, ఎలివేషన్, బెట్లు, బాల్కనీలు, స్టీల్ రెయిలింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఇంటి లోపలి గోడలకు లప్పం వేయించడంతో పాటు డబ్ల్యూపీవీసీ తలుపులు, యూపీవీసీ కిటికీలను అమర్చుతున్నారు. కప్ బోర్డులతో వంట గదులు ప్రత్యేక ఆకర్షణగా మారుతున్నాయి.**

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 3 : ఇప్పుడు కాలం మారింది. రెండు గదుల ఇండ్లు ఉంటే చాలనుకునే కాలం నుంచి సకల వసతులు ఉండేలా నిర్మించుకునే స్థాయికి గ్రామీణ ప్రాంతాలూ చేరుకున్నాయి. ఇల్లు ఒకేసారి కట్టుకుంటాం కదా.. మంచిగా ఉండాలి అనే రీతిలో ఆలోచిస్తున్నారు. ఇండ్ల నిర్మాణాలతో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, రాజస్తాన్ నుంచి వచ్చిన కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

**ఆకర్షణీయంగా..**

ఇంటి కప్పునకు ఎక్కువమంది ఫాల్‌సీలింగ్ ఏర్పాటు చేయించుకుంటున్నారు. రకరకాల డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. జిప్సం ప్లేట్లు కాకుండా యూపీవీసీ ప్లేట్లనూ ఫాల్‌సీలింగ్‌కు వాడుతున్నారు. ఫాల్‌సీలింగ్ వల్ల వేసవిలో చల్లగా ఉంటుందని, పైకప్పు విద్యుత్తు బల్బులతో అందంగా ఉంటుందని గృహ యజమానులు భావిస్తున్నారు. గతంలో తాండూరు బండలు ఫ్లోరింగ్ వేస్తే చాలా గొప్పగా ఉండేది. ఇప్పుడు వాటిని పార్కింగ్ కోసం వాడుతున్నారు. ఇంటి లోపల మాత్రం మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్ వేస్తున్నారు. ఫ్లోరింగ్‌కు పెద్ద ఎత్తున డబ్బులు వెచ్చిస్తున్నారు. పిట్ట గోడ, మెట్లు, బాల్కనీలకు రెయిలింగ్‌కు ఎక్కువగా వాడుతున్నారు. వీటిలో చాలా డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. స్థాయిని బట్టి కప్ బోర్డులను ఏర్పాటు చేసుకుంటున్నారు. బట్టలు, ఇతర వస్తువులు భద్రపరుచుకునేందుకు చాలామంది వీటిని ప్రిపర్ చేస్తున్నారు.

**పట్టణాలకు దీటుగా ఇంటీరియల్ సొగసులు..**

**డిజైన్‌కు ఎంత ఖర్చు అయినా వెనుకాడని యజమానులు**


ఇంటి నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ అంతా లభిస్తుండడంతో గృహ యజమానులకు ఇబ్బంది లేకుండా పోయింది.

**తగ్గిన కలప వినియోగం..**

గతంలో ఇల్లు నిర్మించుకోవాలంటే కలప ఎక్కువగా అవసరం ఉండేది. చౌకోట్లు, తలుపులు, కిటికీలు ఇలా అన్నింటికీ వినియోగించుకునేవారు. వేప, తుమ్మతో పాటు ఆర్థికంగా ఉన్నవారైతే టేకు కలపను వాడేవారు. కానీ, ప్రస్తుతం ట్రెండ్ మారింది. కలపకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. మెయిన్‌డోర్ మాత్రం టేకు లేదా నాణ్యమైన వేప కలపను వాడుతూ.. మిగతా వాటికి డబ్ల్యూపీవీసీ తలుపులు, యూపీవీసీ కిటికీలను ఉపయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి చాలా కంపెనీలు ఉండగా, ఆర్డర్ చేస్తే కంపెనీ సిబ్బంది ఇంటికి వచ్చి అమరుస్తున్నారు.



ఇబ్రహీంపట్నంలో ఆధునిక హంగులతో నిర్మించిన గృహం



ఇబ్రహీంపట్నంలో..

**ఇంటీరియర్‌పైనే ఎక్కువ ఆసక్తి ..**



సకల సౌకర్యాలతో ఇల్లు ఉండాలని కోరురకుంటున్నారు. డబ్బులు ఎక్కువైనా వెనుకడుగు వేయడం లేదు. కలప వినియోగం తగ్గడంతో ఆర్థిక భారం లేకుండా పోయింది. కలపకు బదులు డబ్ల్యూపీవీసీ, యూపీవీసీ వంటివి విరివిగా అందుబాటులోకి వచ్చాయి. గృహ యజమానులు ఇంటీరియల్‌పైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం కంటే ఇంటీరియల్‌కే ఎక్కువ ఖర్చు అవుతున్నది.

**– మైలారం విజయ్‌కుమార్, ఇంటీరియల్ డిజైనర్, ఇబ్రహీంపట్నం**

# బైక్ దొంగ అరెస్ట్

**13 కేసులు నమోదు కాగా, 10 సార్లు జైలుకు..**

**వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి**




వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 3 : అంతర్ జిల్లా బైక్ దొంగను సీసీఎస్, వికారాబాద్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ కోటిరెడ్డి వివరాలను వెల్లడించారు. బంట్వారం మండలం తొర్మామిడి గ్రామానికి చెందిన గుడాల మాణిక్యం బైక్ మైకానిక్‌గా పని చేశాడు. కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నాడు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలు, హాస్టళ్లు, రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లలో పార్కింగ్ చేసిన బైక్‌లను టార్గెట్ చేసేవాడు. రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా, పల్సర్ బైక్‌లను చోరీ చేశాడు. గతంలోనూ ఇతడిపై 13 కేసులు నమోదు కాగా, 10 సార్లు జైలుకు వెళ్లాడు. 3 మొబైళ్లను చోరీ చేయగా కేసులు నమోదయ్యాయి. జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. శనివారం వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య, టౌన్ ఎస్ఐ సత్యనారాయణ రాజు, సీసీఎస్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారని ఎస్పీ తెలిపారు. బైక్‌పై వస్తున్న మాణిక్యంను అపి బైక్ పేపర్లు అడుగగా సరైన వివరాలు తెలుపలేదన్నారు. విచారణలో విస్తూ పోయే నిజాలు బయటకు వచ్చాయన్నారు. బంట్వారం పోలీస్ స్టేషన్‌లో 2009లో బైక్ దొంగతనం మొదటి కేసు నమోదైందన్నారు. 3 నెలల్లోనే 11 బైక్‌లను చోరీ చేసి, తన పొలం వద్ద షెడ్డులో దాచి ఉంచాడని తెలిపారు. అంతకు ముందు వరకు జైలు లో ఉండి వచ్చినట్లు తెలిపారు. దొంగతనం చేసిన బైక్‌ల విలువ రూ.17.30 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. నివాస ప్రాంతాలు, బిజినెస్ దుకాణాలు, పనిచేసే ప్రాంతాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూడాలి




సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సంగీత

ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 3 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులను నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎంలు, వీవీప్యాట్లు, కంట్రోల్ యూనిట్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి పూర్తి అవగాహనతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

## సోషల్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి కుక్కింద విద్యార్థులు ఎంపిక



విద్యార్థి నీలకంఠంను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధారూరు, ఫిబ్రవరి 3 : ధారూరు మండల పరిధిలోని కుక్కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వికారాబాద్‌లో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్టు జిల్లా స్థాయిలో తెలుగు మీడియం నుంచి మొదటి స్థానంలో కుక్కింద పాఠశాల విద్యార్థి బి.నీలకంఠం, మూడో స్థానంలో అదే పాఠశాలకు చెందిన జి.స్పందన నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రవి, వెంకటయ్య, కమల్‌రెడ్డి, తదితరులు విద్యార్థులను అభినందించారు.

## మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నా

**ఖాళీ జాగలకు ఇంటి నంబర్లు ఇచ్చారంటూ ఆందోళన**

**నంబర్లు రద్దు చేసిన అధికారులు**

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 3 : మున్సిపాలిటీ 6వ వార్డు పరిధి పెద్దఅంబర్‌పేటలోని గ్రామ కంఠం స్థలంలో ఖాళీ జాగలకు కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వివిధ పార్టీల నాయకులు చెరుకూరి జగన్, సంజీవ, ప్రహ్లాద్ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. దళితులకు చెందిన గ్రామ కంఠం భూమిలో నకిలీ పత్రాలు సృష్టించి పొందిన ఇంటి నంబర్లను క్యాన్సిల్ చేయాలని నినాదాలు చేశారు. అధికారులు చర్యలు తీసుకునే వరకు కదిలేది లేదని బైఠాయించారు. స్థానిక కౌన్సిలర్ పసుల రాజేందర్, ఇతర నాయకులు పండుగల రాజు తదితరులు అక్కడకు చేరుకుని కమిషనర్ రవీందర్‌రెడ్డికి విషయాన్ని వివరించారు. స్పందించిన ఆయన.. గ్రామ కంఠం స్థలంలో జారీ చేసిన పలు ఇంటి నంబర్లను రద్దు చేశారు. అనంతరం గ్రామస్తులు పెద్దఅంబర్‌పేట సబ్‌రిజిస్ట్రార్‌ను కలిశారు. గ్రామ కంఠం స్థలంలో పొందిన ఇంటి నంబర్ల సాయంతో చేసిన రిజిస్ట్రేషన్లను సైతం రద్దు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న పెద్దఅంబర్‌పేట గ్రామస్తులు

## గ్రామ పంచాయతీల అభివృద్ధిపై

# ప్రత్యేక కార్యాచరణ అమలు

*మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్..*

*పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అధికారులు*




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)

వికారాబాద్/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3 : గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల పాలన ద్వారా అమలు చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇందులో భాగంగా ప్రత్యేక అధికారుల పాలన ద్వారా చర్యలు తీసుకుంటుందన్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీన సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 2వ తేదీ నుంచి ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తామన్నారు. గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులను సిబ్బందితో సమన్వయం చేసుకొని పనిచేసేలా ప్రత్యేక అధికారులకు బాధ్యతలు ఇచ్చినట్లు తెలిపారు. వేసవిలో తాగు నీటికి ఇబ్బందులు రాకుండా 'మిషన్ భగీరథ'తో తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీరు, పారిశుధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డు నిర్వహణ, వైకుంఠ ధామాల అభివృద్ధిపై సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు గ్రామపంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణన్ పాల్గొన్నారు.

**రంగారెడ్డి జిల్లాలో..**

మంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని 558 స్పెషల్ ఆఫీసర్లకు ఒక్కరోజు ఓరియెంటేషన్ నిర్వహించడానికి సన్నాహాలు త్వరగా చేయాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, గ్రామ పారిశుధ్య కార్మికులు, యువతను భాగస్వామ్యం చేస్తూ సమావేశాలు నిర్వహించాలన్నారు. వారం రోజులు టెస్ట్‌డ్రైవ్‌ను నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అనదపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో దిలీప్‌కుమార్, డీఆర్డీవో పీడీ ప్రభాకర్, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అధికారులు